ప్రజాశక్తి
ఆదివారం 30 జులై 2023 5 విజయనగరం



మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని కోరుతూ శనివారం స్థానిక మూడు లాంతర్ల వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళలపై అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ అల్లర్లకు బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాల న్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులు టివి దుర్గారావు, ఎస్.కె.బాషా. మోహన్ రావు, చంద్రకళాధం తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నిరంతర అధ్యయనం అవసరం

న్యాయవాదుల సెమినార్‌లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

న్యాయవాదులకు నిరంతర అధ్యయనం అవసరమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో, జిల్లా బార్ అసోసియేషన్ సహకారంతో స్థానిక తోటపాలెం సాయి బాలాజీ పంక్షన్ హాలులో వివిధ న్యాయపరమైన అంశాలపై న్యాయవాదులకు శనివారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ, కొత్త చట్టాలు, కొత్తకొత్త తీర్పులపై న్యాయవాదులు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువ న్యాయవాదులు ఈ అంశంపై దృష్టి పెట్టాల్సి ఉందని సూచించారు. సీనియర్ న్యాయవాదులు తాము సముపార్జించిన అనుభవాన్ని, జ్ఞానాన్ని ఇతరులతో పంచుకోవాలని కోరారు. న్యాయవాదులకు అవగాహన కల్పించే లక్ష్యంతో సెమినార్‌ల నిర్వహణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర బార్ కౌన్సిళ్లు అత్యంత చురుకైన పాత్ర పోషిస్తున్నాయని అభినందించారు. ఇలాంటి సెమినార్‌లను తరచుగా నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. సెమినార్‌లను సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాదులను కోరారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ మాట్లాడుతూ, ప్రతిరోజూ వివిధ కోర్టుల్లో సరికొత్త తీర్పులు వస్తుంటాయని, వాటిపై దృష్టి పెట్టాలని, అధ్యయనం చేయాలని సూచించారు. జడ్జీలుగా ఎంపికయ్యేవారిలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల న్యాయవాదుల సంఖ్య తక్కువగా ఉంటోందని అన్నారు. వీరు తమ ఆంగ్ల భాషా నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు. దీనికోసం ఆంగ్ల దినపత్రికలను క్షుణ్ణంగా చదవాలని చెప్పారు. న్యాయవాదులు తమవద్దకు వచ్చే కక్షిదారులనుంచి పూర్తి సమాచారాన్ని తీసుకోవాలని సూచించారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ గంటా రామారావు మాట్లాడుతూ, విజయనగరం జిల్లా కళలకు పుట్టినిల్లు అని, న్యాయవాదుల్లో కూడా ఎంతోమంది కళాకారులు ఉన్నారని అన్నారు. న్యాయవాద వృత్తిలో కూడా పేరుప్రఖ్యాలుతు పొందారని చెప్పారు. ఇలాంటి సెమినార్‌ల వల్ల న్యాయవాదుల్లో నేర్చుకోవాలన్న స్ఫూర్తి రగులుతుందని అభిప్రాయపడ్డారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ, న్యాయపరమైన అంశాలపై సంపూర్ణ అవగాహన కల్గించేందుకు ఇటువంటి సెమినార్‌లు దోహదం చేస్తాయని అన్నారు. యువ న్యాయ వాదులకు, న్యాయ విద్యార్థులకు ఇవి చాలా ఉపయోగపడతాయని అన్నారు. వీటిని సద్వి నియోగం చేసుకోవా లని కోరారు. సీనియర్ న్యాయవాదులనుంచి కూడా యువ న్యాయవాదులు ఎంతో నేర్చు కోవాల్సి ఉందన్నారు.

అనంతరం జరిగిన సెమినార్‌లో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. వివిధ న్యాయపరమైన అంశాలు, చట్టాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. జిల్లా బార్ అసోసియేషన్‌కు విరాళాలు అందజేసిన న్యాయవాదులను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపి బార్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ కె.రామ జోగేశ్వరరావు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఎ.రామిరెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ దామోదర రామ మోహనరావు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు జిల్లా న్యాయమూర్తులు, జిల్లా బార్ అసోసియేషన్ నాయకులు, వివిధ బార్ అసోసియేషన్ల నాయకులు, ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు, పెద్దసంఖ్యలో జిల్లా న్యాయవాదులు పాల్గొన్నారు.



సెమినార్‌లో ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి వెంకట శేషసాయి


సెమినార్‌లో పాల్గొన్న న్యాయవాదులు, బార్‌అసోసియేషన్ నాయకులు


సిఐటియు నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ఐక్య పోరాటాలకు సిద్ధం చేయాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మికవర్గాన్ని ఐక్య పోరాటాలకు సిద్ధం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగ రావు, కార్యదర్శి కె.సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు శనివారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల సిఐటియు కార్యకర్తల వర్క్‌షాప్ కెఎల్‌పురంలోని ఎన్‌పిఆర్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ వికృత విధానాలకు కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతున్నదని, అందువలన కార్మిక వర్గాన్ని ఐక్యం చేసే బాధ్యత సిఐటియుపై ఉందని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకు దాసోహం అవుతుందని, అందులో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ బలహీనపరుస్తున్నారని అన్నారు. రోజురోజుకు నిత్యవసర సరుకులు ధరలు పెరిగి కార్మికులు పొందుతున్న నిజ వేతనం తగ్గిపోతున్నదనీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని తెలిపారు.. అసంఘటితరంగ కార్మికుల సంక్షేమ చట్టాలను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం చేసే లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై సిఐటియు నాయకత్వంలో దేశవ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి విస్తృత పోరాటాలకు సిద్ధం చేస్తామని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి బివి రమణ, విజయనగరం జిల్లాకార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రెండు జిల్లాల సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్, దావాల రమణారావు, వై.మన్మధరావు, టివి రమణ, వి.లక్ష్మి, ఎన్ వై నాయుడు, బి సుధారాణి, బి.రమణ, బి.సూర్యనారాయణ, జి అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.


మహాసభలో మాట్లాడుతున్న భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరరావు

మనువాద భావజాలం పోగొట్టి...

రాజ్యాంగ విధానాలు తీసుకురావాలి

భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షులు భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల్లో మనువాద భావజాలం పోగొట్టి రాజ్యాంగ విధానాలు పూర్తిస్థాయిలో అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇది జరగాలంటే ప్రజలు చైతన్యంతో కుల,మతాలకు అతీతంగా మెలగాలని భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు సి.భాస్కరరావు పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ భవనంలో శనివారం జరిగిన భారత్ బచావో జిల్లా మహాసభలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రజల్లో ప్రతి ఒక్కరిలో మనువాద భావాలు పాతుకుపోయాయని, ఈ భావజాలాన్ని పక్కనపెట్టి రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని పేర్కొన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఆదాని, అంబానీలకు తప్ప సామాన్య ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేయలేదని అన్నారు. మోడీ వలన 13 వేల కోట్ల ఆస్తిపరుడుగా ఉన్న ఆదాని ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానానికి చేరుకున్నాడని, మోడీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేశారే తప్ప ఒక్క ప్రభుత్వ రంగ సంస్థనైనా నెలకొల్పారా అని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్, విహెచ్‌పి సంస్థల కనుసన్నలలో మోడీ పాలన జరుగుతుంది తప్ప ప్రజా సంక్షేమ పాలన కాదని విమర్శించారు.

మతవాద, పెట్టుబడిదారీ పాలన చేస్తున్న మోడీని ఎన్నికల్లో ఓడించడంతోపాటు మనువాద భావాలను ప్రజల్లో లేకుండా చేయడమే ప్రధాన లక్ష్యం కావాలని అన్నారు. హిందూ వాదం, మనువాదం పోయి రాజ్యాంగబద్ధమైన ప్రజావాదాన్ని ప్రజలు కోరుకోవాలని విజ్ఞప్తి చేశారు. భారత్ బచావో జిల్లా కన్వీనర్ ఎ. కరీం అధ్యక్షతన జరిగిన ఈ సభలో వివిధ ప్రజా ప్రజా సంఘాల ప్రతినిధులు పి.షణ్ముఖరావు, గూడూరు సీతామహాలక్ష్మి, ఒమ్మి రమణ, జీవి రంగారెడ్డి, పి.అవినాష్, సుంకర రమేష్ కుమార్, కె.దయానంద్, బుగత అశోక్, అంబేద్కర్, పెంకి చిట్టిబాబు, ఆర్ఎస్ జాన్, బొంగ భానుమూర్తి, మహమ్మద్ రఫీ, గోక రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు,

బొత్సవి అవగాహనలేని మాటలు

టిడిపి నాయకులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

కుప్పం కంటే చీపురుపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసినట్లు విద్యాశాఖా మంత్రి బొత్సచెప్పడం సిగ్గుచేటని టిడిపి విజయనగర పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. కుప్పం నియోజకవర్గం బొత్స అవగాహన లేని మాటలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. శనివారం స్థానిక అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుప్పం కంటే చీపురుపల్లి బాగా అభివృద్ధి చేశాను అంటూ బొత్స జోకులు వేస్తున్నారని అన్నారు. కుప్పం అభివృద్ధితో చీపురుపల్లిని పోల్చడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కుప్పంలో ఎన్నో విద్య, ఉపాధి, ఆరోగ్య సదుపాయాలు ఉన్నాయని అన్నారు. ఈ నాలుగేళ్లలో చీపురుపల్లిలో అభివృద్ధి ఏమి చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయలేకపోయారని, కనీసం కాలువల్లో పూడికతీతాలు కూడా తీయలేకపోయారని అన్నారు. గత టిడిపి హయాలో జరిగిన అభివృద్ధి తప్పితే ఈ నాలుగేళ్లలో చేసిందేమీ లేదని అన్నారు. వర్షాలతో జగనన్న కాలనీలు మునిగిపోతుంటే బొత్స కామెడీగా మాట్లాడు తున్నారని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారుబాబు, మండల కార్యదర్శి గంటా పోలినాయుడు, మురళీమోహన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద రక్తదానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలు తక్కువగా ఉన్నందున విజయనగరం మున్సిపల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు (సామాజిక సేవా కార్యకర్త) పొట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 30 మంది యువకులు రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా సెట్విజ్ సిఇఒ కె.రాంప్రసాద్ పాల్గొని రక్తదాతలను అభినందించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరికొందరి ప్రాణాలను నిలపాలని కోరారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఎం. రాము. వి.సత్యారాం, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ..

విజయనగరం కోట :

విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం అధ్యక్షులు షేక్ ఇల్తామాష్ తెలిపారు స్థానిక కోట జంక్షన్ వద్ద గల విజయ బ్లడ్ బ్యాంక్ లో ఈ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్మీ ఉద్యోగి ఆవాల కృష్ణ తన స్నేహితులతో కలిసి 15 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రాము, విజయ్ , రఘు తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

సుజల స్రవంతి ద్వారా సాగునీరు

రాష్ట్ర మంత్రి బొత్స వెల్లడి

ప్రజాశక్తి-మెరక ముడిదాం

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా మెరకముడిదాం మండలంలోని అన్ని గ్రామాలకూ సాగునీరు అందిస్తామని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్ససత్యనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని గొల్లలవలస లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి బొత్స మాట్లాడుతూ ఏ విధమైన అవినీతి, మధ్యవర్తులు, దళారులు లేకుండా పార్టీ రహితంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా సాగు నీరు అందించేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోబోతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం శాశ్వత మైన పథకాలను ప్రజలకు అందించక పోవటమే ఇప్పుడు ప్రజలకు చెప్పుకోవటానికి ఏమి లేక ప్రభుత్వంపై విమర్శలు చేస్తోందని అన్నారు. ఇది వరకు విత్తనాలు, ఎరువుల కోసం మండలం చుట్టూ, ఆ నాయకులు చుట్టూ, రోజులు తరబడి తిరగ వలసి వచ్చేదని, ఇపుడు అది అవసరం లేదని మీ గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాలు ద్వారానే ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. కార్పొరేటర్ల పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిర్మించి మౌలిక సదుపాయలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి సూర్య నారాయణరాజు, ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, గొల్లల వలస సర్పంచ్ బూరాడ గోవిందరావు, ఎంపిటిసి సభ్యులు వాళ్లే రూపదేవి, మండల నాయకులు ఎస్‌వి రమణ రాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల వెంకటరావు, పప్పల కృష్ణమూర్తి, బూర్లె నరేష్ కుమార్, కుచ్చర్లపాటి శివరామకష్ణ ప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

పార్వతీపురంలో వైసిపి జిల్లా కార్యాలయం ప్రారంభం

వైసిపి జిల్లా కార్యాలయాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, ఎమ్మెల్సీ సభ్యులు పాలవలస విక్రాంత్, కురుపాం, పాలకొండ, పార్వతీపురం, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

గడప గడపకూ కార్యక్రమంలో కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పలువార్డుల్లోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం 49వ డివిజన్ గాజులరేగలోని ప్రధాన రహదారి నుంచి జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నింటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు గురించి తెలుసుకున్నారు. ప్రజాస్పందన కూడా అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. స్థానికంగా నెలకొన్న సమస్యల పైన తక్షణమే స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అక్కడున్న అధికారులకు ఆదేశించారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్,సహాయ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్లు నడిపిల్లి ఆదినారాయణ, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, డివిజన్ ఇన్చార్జి కనుగుల రాజా, పిఎసిఎస్ అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలపై ఆరా తీస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని 48 వ డివిజన్లో రూ.16లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. ముత్యాలమ్మపేట వద్ద రహదారులు, కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు మధు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లనాటి సమస్యలను కూడా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక దృష్టితో పరిష్కరిస్తూ అభివృద్ధి దిశగా పయనిస్తున్నారని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక సమస్యలను గుర్తించి రూ.20 లక్షలతో కాలువలు, ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు జిల్లా బాడ్మింటన్ క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ బాడ్మింటిన్ అసోసియేషన్ రెండు రోజుల పాటు తిరుపతిలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్ -19 బాలబాలికల- సింగిల్స్, డబుల్స్ పోటీలకు జిల్లా నుండి 10 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారిలో కే.పవన్, కె ముకేష్ కుమార్, ఎ.భరద్వాజ, బి.సూర్య కిరణ్, వి.పవన్ కుమార్, వి.జాహ్నవి, కె.ప్రజ్ఞనాయుడు, బి.హారిక, పి.మౌనిక, జె.శ్రియ దేవి ఉన్నారు. ఈ బృందానికి మేనేజర్‌గా జె.విజయ రామరాజు, కోచ్ లుగా ఎస్.శ్రీనివాస్, ఆర్.మోహనరావు వ్యవహరించనున్నారు.

ఘనంగా మొహరాం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా వ్యాప్తంగా ముస్లిములు శనివారం మొహరాం నిర్వహించుకున్నారు. ఆనాటి దుష్ట యూదు రాజుల అన్యాయాన్ని, అధర్మాన్ని వ్యతిరేకిస్తూ న్యాయ పరిరక్షణ, ధర్మ పరిరక్షణకు ఇస్లాం మతంలో దైవ ప్రవక్త మొహమ్మద్ మనువడు హజరత్ ఇమామ్ హుస్సేన్, యూదులు సైన్యంతో పోరాటం చేసి యుద్ధ భూమిలో మరణించారని ముస్లిం పెద్దలు తెలిపారు. ప్రజలంతా సౌభాగ్యంతో ఉండాలని వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షులు ఎం.ఖరీమ్ తెలిపారు.

పరిశ్రమలు ఎక్కడ ? భూములు ఎవరికి ?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎద్దు ఈనిందంటే ఇల్లవతల కట్టేయమన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. కానీ, మన జిల్లా ప్రజానీకం అటువంటి మొద్దులు కాదు సుమా..! కాస్తాంత సౌమ్యంగా, సున్నితంగా వ్యవహరిస్తున్నా ఆలోచనలో మరీ అంత వెనుకబడిపోలేదు. నిన్నగాక మొన్న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన జరిగిన పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశంపై ప్రజలు స్పందిస్తున్న తీరే ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. ఆ సమావేశంలో అధికారుల నిర్ణయాలు, ఉన్నతాధికారి ఆదేశాలు కోటలు దాటుతున్నా ఆచరణలో కనిపించక పోవడంతో ఒకిన్ని అనుమానాలు, ఆశ్చర్యాలు వ్యక్తమౌతున్నాయి. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు భూ కేటాయింపు చేయడంలో జాప్యం జరగడానికి వీల్లేదని కలెక్టర్ ఆదేశించారు. కానీ, ఆ పరిశ్రమలు ఎక్కడ? ఎవరు? ఏయే పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు? ముడిసరుకు మేమిటి? ఉత్పత్తులు ఏమిటి? మార్కెటింగ్ పరిస్థితి ఎలా ఉంటుంది? ఎగుమతులు, దిగుమతులు ఉంటాయా? వాటి వల్ల జిల్లాకు ఒనగూరేదెంత ఉంటుంది? ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి కల్పన ఏమేరకు ఉంటుంది? అన్నది జిల్లాలో చాలా మంది చర్చిస్తున్న అంశం. ఇందుకు కారణం లేకపోలేదు. జిల్లా పారిశ్రామిక రంగంలో అత్యంత వెనుకబడి ఉంది. జిల్లా వార్షిక ఆదాయం రూ.35,385 కోట్లు కాగా, పరిశ్రమల ద్వారా వస్తున్న ఆదాయం కేవలం రూ.4,520కోట్లు (13.91శాతం) మాత్రమే. ఇంకా లోతుగా పరిశీలిస్తే గడిచిన ఐదేళ్లగా ఈ ఆదాయం తగ్గుతూ వస్తోంది. దీనికితోడు ఇటీవల జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్, చెక్కెర కర్మాగారాలు మూతపడ్డాయి. దీంతో, గడిచిన పదేళ్లలో సుమారు 30వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయారు. జిల్లా నుంచి వలసలు కూడా ఎక్కువేనన్నది వేరేగా చెప్పనక్కర్లేదు. విటి అగ్రహారం, సారిపల్లి, కంటకాపల్లి, బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో కొన్ని దశాబ్ధాల క్రితమే కేటాయించిన భూములు ఖాళీగానే ఉన్నాయి. ఆయా చోట్ల ఏర్పాటు చేసిన చాలాపరిశ్రమలు కూడా మూతపడ్డాయి. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లాకు పరిశ్రమ వస్తుందంటే లక్షల కుటుంబాలు ఆసక్తిగా ఎదురు చూస్తాయి. చూస్తున్నాయి కూడా. ఈ నేపథ్యంలో జిల్లాకు రాబోతున్న పరిశ్రమలు, ఉత్పత్తి, ఉత్పాదకత, వనరులు, ఇతర అవకాశాల గురించి ప్రస్తావన లేకుండా కేవలం భూముల కేటాయింపుపైనా, భద్రతా ప్రమాణాలపైనా చర్చించడం హాస్యాస్పదంగా ఉంది. జిల్లాకు రాబోతున్న యూనిట్లు, వాటి యజమానులు, వారికి కేటాయిస్తున్న భూముల గురించి కనీసం మీడియాకు విడుదల చేసిన ప్రకటనల్లో కూడా ఆయా అంశాలు లేకపోవడం గమనార్హం. దీన్నిబట్టి పరిశ్రమలన్నీ ఉత్తుత్తివేనని, కాగితాల్లో లెక్కలు మాత్రమేనని, భూములు ఎవరికో కట్టబెట్టడానికే ఇటువంటి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని జనం బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.




స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు విశేష స్పందన

ప్రజాశక్తి - బొబ్బిలి

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు విశేష స్పందన లభించింది. స్థానిక ఎస్.ఆర్.ఐ క్వీన్స్ ఆసుపత్రిలో శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు 50మంది మహిళలు హాజరయ్యారు. మహిళలకు కేన్సర్ వైద్య నిపుణులు డి.వెంకటసాంబశివరావు వైద్య పరీక్షలు చేసి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కేన్సర్ పై అవగాహన పెంచేందుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు స్త్రీ వైద్య నిపుణులు పి.రామ్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జేసీ రాజు, వారణాసి శ్రీహరి, కోశాధికారి శ్రీనివాసరావు చెప్పారు. కేన్సర్ ప్రారంభంలో గుర్తించి వైద్యం అందిస్తే పూర్తిగా నివారించవచ్చునని వైద్యులు వెంకటసాంబశివరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు చుక్క శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్వర్ మొరాయింపుతో ఇక్కట్లు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో పలు గ్రామాల్లో బిఎల్ఒలు నిర్వహిస్తున్న ఇంటింటా ఓటర్ల సర్వేలో సర్వర్ మొరాయించడంతో ఇక్కట్లు పడ్డారు. సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారు, తొలగింపులు, చేర్పులు, మార్పుల వివరాలు అప్‌లోడ్ కాలేదు. దీంతో బిఎల్ఒలు ఇబ్బందులు పడ్డారు. బిఎల్ఒల్లు ప్రతిరోజు ఉదయం 10 గంటలకు వచ్చి పదకొండు గంటల వరకు వేచి ఉండడమే తప్ప పూర్తిస్థాయి వివరాలు ఇవ్వలేకపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి సర్వర్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న పల్సర్ బైక్ రమణ

పల్సర్ బైక్ రమణ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గుర్ల

మండలంలో బూర్లిపేట గ్రామానికి చెందిన రాగోలు రాము కొన్ని నెలలుగా కేన్సర్ వ్యాధితో బాధ పడుతున్నారు. ఇతడు ఆటో డ్రైవింగ్ చేసుకుంటూ వారి కుటుంబాన్ని పోషించుకునేవాడు. వీరికి సెంటు భూమి కూడా లేదు. సొంత ఇల్లు కూడా లేదు, ఇతనికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. వీళ్ల పడే బాధను పక్కనే ఉన్న గురునాయుడు పేట గ్రామానికి చెందిన మాతృభూమి సేవా సంఘం చీపురుపల్లి నియోజకవర్గ ఇంఛార్జి బూర్లె పైడినాయుడు చూసి ఈ విషయాన్ని పల్సర్ బైక్ సింగర్ రమణ దృష్టిలో పెట్టాడు. దీనికి స్పందించిన రమణ రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా అలాంటి కుటుంబ నేపథ్యంలోనే పుట్టానని ఆ బాధలు ఎలా ఉంటాయో తనకి తెలుసునని అన్నారు. అందుకే తనకు తోచిన సాయం చేసానని చెప్పారు. అనంతరం మాతృభూమి సేవా సంఘం ద్వారా నెలకు సరిపడగా నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, ఎంపిటిసి బూర్లె జోగి నాయుడు, రామకృష్ణ, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్.నారాయణమూర్తితో ఎమ్మెల్యే శంబంగి సోదరులు

ఎమ్మెల్యేను కలిసిన ఆర్.నారాయణమూర్తి

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడును సినీ దర్శకుడు, నటుడు ఆర్.నారాయణమూర్తి వైసిపి క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాను తీసిన యూనివర్సిటీ చిత్రంపై ఎమ్మెల్యే శంబంగితో చర్చించారు. అనంతరం నారాయణమూర్తి మాట్లాడుతూ ఇటీవల ఆయన దర్శకత్వం వహించిన యూనివర్సిటీ చిత్రాన్ని ప్రజలు, విద్యార్థులు, యువత చూసి ఆదరించాలని కోరారు. ఈ చిత్రాన్ని ప్రభుత్వ బడులు, ప్రభుత్వ విద్యా విధానం బలోపేతం చేయడం కోసం తీసినట్లు చెప్పారు.


బాధితులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఆపదలో ఉన్నవారికి బీమా తోడు

ప్రజాశక్తి - కొత్తవలస

ఆపదలో ఉన్న ప్రతి వారిని జగనన్న బీమా పథకం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదుకుంటున్నారని ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్త సుంకరిపాలెం గ్రామానికి చెందిన పెదిరెడ్ల సన్యాసిరావు ప్రమాదవశాత్తు మరణించగా ఆయన భార్య గంగకు జగనన్న బీమా పథకం ద్వారా రూ.5 లక్షలు, కంటకాపల్లికి చెందిన సేనాపతి గణేష్ ప్రమాదవశాత్తు మరణించగా ఆయన తండ్రి వెంకటరావుకు రూ.5 లక్షలు చెక్కులను శనివారం అందజేశారు. కొత్త సుంకరిపాలెం గ్రామంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి పాలన మీద ప్రజలందరూ నమ్మకం ఉంచారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ డైరెక్టర్ పి. శివ పార్వతి, పిఎసిఎస్ పాత్రుడు, కంటకాపల్లి మదిన అప్పల రామ, నాయకులు పెదిరెడ్ల వెంకట సత్యనారాయణ (శ్రీను), పెదిరెడ్ల శరభన్నపాత్రుడు, వరహాలు, పెదిరెడ్ల పార్వతి, పెదిరెడ్ల పాత్రుడు, పెదిరెడ్ల రాజేష్, పెదిరెడ్ల రావాలు, లెంక రావాలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీభరత్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - వేపాడ

టిడిపి విశాఖ పార్లమెంట్ నాయకులు శ్రీభరత్ పుట్టిన రోజు వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు విశాఖ వెళ్లి టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ఎస్ కోట నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, తెలుగు రైతు సంఘం మండల ఉపాధ్యక్షుడు సికిలె రమణ, కోటన ప్రసాద్, టిడిపి సీనియర్ నాయకుడు గొర్లె నాగరాజులు శుభాకాంక్షలు తెలిపారు.


శ్రీభరత్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

వర్షం పడితే నరకమే

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వసతి కష్టాలు పడుతున్నారు. పాఠశాల గదులన్నీ శిథిలావస్థకు చేరడంతో వర్షా కాలం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాలను అభివృద్ధి చేసేందుకు తొలుత నాడు నేడు కింద ఎంపిక చేసి కొద్ది రోజుల్లోనే తిరిగి ఆ జాబితా నుంచి పేరును తొలగించారు. ఇక్కడ పాటూరు, ఆర్‌ఎస్‌పేట, కొత్తబొద్దాం, ఓబలయ్యపాలెం, ఎల్‌కోట సీతారాంపురం గ్రామానికి చెందిన 68 మంది పిల్లలు చదువుతున్నారు. ఏడుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వర్షం వస్తే గదులన్నీ కారిపోవడం, ఎండ వస్తే చెట్ల కింద పిల్లలు విద్యాబోధన చేయాల్సి వస్తోంది. ఈ విషయం పలుమార్లు విద్యార్థులు తల్లిదండ్రులు ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న బాధలను పరిశీలించి నాడు నేడు నిధులు మంజూరు చేసి విద్యార్థులకు సౌకర్యాలు మెరుగు పర్చాలని కోరుతున్నారు. ఈ విషయంపై మండల విద్యాశాఖ అధికారిని వివరణ కోరగా నాడు నేడు మొదటి విడత మంజూరు అవ్వడం వాస్తవమేనని ఈ పాఠశాల మ్యాపింగ్‌లో పొందుపరచకపోవడంతో మంజూరైన నిధులు రద్దు అయ్యాయని తెలిపారు.


వర్షానికి కారిపోతున్న బొద్దాం పాఠశాల

మల్లమ్మపేటలో పాడైపోయిన రహదారులు

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మల్లమ్మపేటలో రహదారులు పాడైపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల్లమ్మపేట శివారులో మట్టి రోడ్లు, పాడైపోయిన రోడ్లు ఉండడంతో వర్షాకాలంలో ఇళ్ల ముందే నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మురుగునీటి కాలువలు అధ్వాన్నంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు వేయాలని, మురుగునీటి కాలువలు శుభ్రం చేయాలని అధికారులను కోరుతున్న పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు వేయాలని, కాలువలు శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.


బురదగా మారిన రహదారి

చెరువుల్లా మారిన రహదార్లు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రోడ్లు, భవనాల శాఖ నిర్లక్ష్యంతో రహదార్లు చెరువుల్లా మారుతున్నాయి. ముఖ్యంగా నగర పంచాయతి పరిధి మొయిద జంక్షన్ నుంచి జరజాపు పేట వెళ్లే రహదారిలో కల్వర్టు పూడుకు పోయి మరుగు నీరు రోడ్డు మీదకి వచ్చి వాహన దారులు, ప్రయాణీకులను తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండిపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి. పారి శుధ్య పనులు చేస్తున్నా కల్వర్టు ఇరుకగా ఉండడం వల్ల పూడుక తీయడం కష్టంగా ఉందని సిబ్బంది చెబుతున్నారు. కల్వర్టు వెడల్పు చేయడం ద్వారా పూడిక నివారించి నీరు నిల్వ లేకుండా చేయగలమని చెబుతున్నారు. అయితే ఈ సమస్య ఎన్నో ఏళ్లుగా ఉంది. పలుమార్లు రహదార్లు, భవనాల శాఖ దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని నగర పంచాయతి సిబ్బంది చెబుతున్నారు. ఇదిలా వుండగా రామతీర్థం గ్రామంలో నడిబొడ్డున ఇదే పరిస్థితి ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ గ్రామంలో మరుగు నీరు రహదారి పై ప్రవహించి గుంతలు పడి వాహన దార్లు, పాదచా రులు ఇబ్బం దులు పడుతున్నారు. ఇప్పటికైనా రహదార్లు, భవనాల శాఖ స్పందించి సమస్య పరిష్కరిం చాలని కోరుతున్నారు.


కల్వర్టు వద్ద నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న సిబ్బంది

చెరువులకు జలకళ

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ రెవెన్యూ పరిధిలో తూము చెరువు, డిఆర్‌పేటలో దబ్బిరాజు చెరువు, జగ్గయ్యపేటలో ఊర చెరువు, సింగరాయలో కోమటి చెరువు, వావిలపాడులో కృష్ణంరాజు చెరువులతో పాటు పలు గ్రామాలలో చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మారిక కొండల నుంచి వచ్చే వర్షపు నీరు చెరువుల్లో చేరడంతో చప్టాలు పొంగి పొర్లుతున్నాయి. సకాలంలో వర్షాలు పడటంతో రైతులందరూ వరి నాట్లు పనుల్లో బిజీగా పొలాల్లో కనిపిస్తున్నారు.


చెరువు నుంచి చప్టా ద్వారా పారుతున్న నీరు

ముంజేరులో దాహం కేకలు

ప్రజాశక్తి- డెంకాడ/ భోగాపురం

మండలంలోని ముంజేరు గ్రామంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. తాగడానికి నీళ్లు లేక గ్రామస్తులు విలవిలలాడుతున్నారు. గ్రామంలో మహిళా మండలి భవనం పక్కన ఉన్న చేతి పంపులు వద్ద నీటిని పట్టుకొని తాగేవారమని, రెండు చేతి పంపులు మరమ్మత్తుల గురై రెండు నెలలు కావస్తున్నా అధికారులు కానీ, నాయకులు గానీ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. కుళాయిల్లో నీరు రెండు రోజులకు ఒకసారి వస్తుందని, కుటుంబానికి రెండు బిందులు పట్టుకునేసరికి నీరు అయిపోతుందన్నారు. నీరు లేక స్నానం చేయకుండానే పిల్లల్ని పాఠశాలకు పంపించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. నీరు లేక ఇబ్బంది పడుతున్నామని, చేతిపంపులు మరమ్మత్తు చేయమని పంచాయతీ కార్యాలయానికి వెళ్తే బాగు చేయిస్తాం, గాబరా పడితే పనులు జరగవని అని నిర్లక్ష్యంగా అధికారులు, నాయకులు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి ఇంటికి నీళ్లు అందిస్తామని ప్రభుత్వం చెప్తుంటే దానికి భిన్నంగా తాగడానికి గుక్కెడు నీళ్లు అందించలేకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి చేతిపంపులు బాగు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయం ఎంపిడిఒ అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా ఇప్పటి వరకు ఈ సమస్య తన దృష్టికి రాలేదని వెంటనే చేతి పంపులు బాగుచేయిస్తామని తెలిపారు.


మరమ్మతుకు గురైన బోర్లు

ఆవు దూడపై ఏనుగుల దాడి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సరసనాపల్లి గ్రామ సమీపం పైలవారి తోటలో కడగల స్వామి నాయుడుకు సంబంధించిన దూడపై పెద్ద ఏనుగు శనివారం దాడి చేసింది. పెద్ద ఏనుగు తొక్కుడు వల్ల దూడ కాలు విరిగి నడవలేని పరిస్థితిలో ఉంది. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి దూడకు ప్రథమ చికిత్స చేశారు.

వంగర: మండలంలో వారం రోజులు పాటు సంచరించిన గజరాజులు ఇక్కడ నుండి ఈనెల 28న రేగిడి మండలం సరసనాపల్లికి తరలి వెళ్లిన గజరాజులు మరలా అక్కడ నుంచి తిరిగి వచ్చి వంగర మండలం సంగాంకు శనివారం సాయంత్రం చేరుకున్నాయని తహశీల్దార్ డి ఐజాక్ తెలిపారు. మండలంలో గజరాజులు ఉండేందుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉండడంతో తిరిగి వచ్చేశాయని పలువురు చెబుతున్నారు. కాగా గజరాజుల వైపు ప్రజలు ఎవరూ వెళ్లకుండా అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.


గాయపడిన దూడను పరిశీలిస్తున్న అధికారులు

ఆ వాహనంలో ఏముంది?

- వేరుశెనగకాయల మాటున గంజాయి తరలింపు?
- పోలీసుల అదుపులో వాహనం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని పోలీసులకు శుక్రవారం అర్ధరాత్రి మెంటాడ అల్లూరి సీతారామరాజు జిల్లాల సరిహద్దు ప్రాంతం గరుగుబిల్లి వద్ద ఓ వాహనాన్ని పట్టుబడినట్లు తెలిసింది. ఆ వాహనంలో ఏముందనేది అంతుచిక్కడం లేదు. ఒక వాహనంలో గంజాయిని తరలిస్తున్నారని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆంధ్ర పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లినట్లు సమాచారం. అక్కడ వున్న వాహనాన్ని అదుపులోకి తీసుకొని ఆంధ్ర పోలీసు స్టేషన్‌కు అక్కడ నుంచి గజపతినగరం సర్కిల్ కార్యాలయానికి తరలించారు.

వాహనంలో ఏముంది?

పోలీసులకు పట్టుబడిన వాహనంలో చెనక్కాయలు మాటున గంజాయి వున్నట్లు మండలంలో ప్రచారం జరుగుతుంది. అరకు లేదా ఒడిశా నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా గరుగుబిల్లి వద్దకు తీసుకొని వచ్చి ఇక్కడ లోడ్ చేసి విశాఖకు తరలించేందుకు సన్నాహాలు చేసినట్లు సమాచారం. పోలీసులకు అనుమానం రాకుండా చెనక్కాయలు మాటున గంజాయిని తరలించాలనుకున్నారు. బరువు ఎక్కువ కావడంతో చంపావతి నది ప్రాంతం వద్ద వాహనం మొరాయించింది. దీంతో స్థానికులకు అనుమానం కలిగింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అప్రమత్తమై వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. అయితే వాహనంలో ఏముందో పోలీసులు స్పష్టత ఇవ్వడం లేదు. డ్రైవర్ పోలీసులు అధుపులోవున్నాడా? పరారయ్యాడా తెలియవలసి వుంది? వాహనంలో ఏమీ లేకపోతే డ్రైవర్ ఎందుకు పారిపోయాడు. పారిపోకపోతే డ్రైవర్ ఎక్కడ అన్న సందేహం నెలకొంది. ఒకవేళ అందులో గంజాయి ఉంటే పోలీసులు ఎందుకు స్పష్టత ఇవ్వలేదన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.


పోలీసులకు పట్టుబడ్డ వాహనం

రెండేళ్లు క్రితం వెలుగులోకి

నవంబర్ 2021లో మొట్టమొదటి సారి అరకు నుంచి మెంటాడ మీదుగా గంజాయి రవాణా జరుగుతుండగా అప్పటి ఎస్ఐ సుదర్శన్ రెండు వాహనాలను పట్టుకున్నారు. వరుసగా 20 రోజుల్లో నాలుగు సార్లు అక్రమ గంజాయి రవాణాను అడ్డుకొని సుమారు వెయ్యి కేజీలు పట్టుకున్నారు. పిట్టాడ వద్ద చెక్ పోస్ట్ పెట్టి నివారించారు. ఈ మధ్యకాలంలో రవాణా ఆగిపోయిందని గ్రహించిన పోలీసులు క్రమేనా చెక్ పోస్టును రమారమి మూసివేసారు. ఇది గ్రహించిన గంజాయి ముఠా ఇదే ప్రాంతం గుండా రవాణాకు అనువుగా ఉంటుందని ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

31న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చిన బురాడపేటలో ఈ నెల 31న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తుమ్మల పేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడి నాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాజీ సర్పంచ్ కీర్తి శేసులు నడిపిల్లి రామునాయుడు 3వ వర్ధంతి సందర్భంగా మిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పైడి నాయుడు కోరారు.

జగనన్న సురక్షతో మేలు


ప్రజాశక్తి- రేగిడి

జగనన్న సురక్ష పథకంతో ఉచిత ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం ఎంతో మేలు చేకూరుతుందని వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్మోహన్‌రావు, ఎంపిడిఒ నాగమణి అన్నారు. శనివారం తోకలవలసలో జగనన్న సురక్ష పథకంలో ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన వారందరికీ 11రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. మండల విప్ మజ్జి శ్రీనివాస్, సర్పంచ్ సూర్య కుమారి, సచివాలయం కన్వీనర్ మీసాల ఉమామహేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శి రాకేష్ ఉన్నారు.

అభివృద్ధికి పెద్దపీట: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గజపతినగరం

వైసిపి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. శనివారం మండలంలోని జిన్నాంలో రైతు భరోసా కేంద్రాన్ని, హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు అందరికీ వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని ప్రతి సచివాలయం పరిధిలో వెల్నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని నియమించిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలను గ్రామస్థాయిలో అందిస్తున్నామన్నారు. రైతులు ఎరువుల కోసం విత్తనాల కోసం క్యూలు కట్టాల్సిన పనిలేదన్నారు. గతంలో రైతులు ఎరువులు, విత్తనాలు కోసం నానా ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, నాయకులు బెల్లాన త్రినాధరావు, వైస్ సర్పంచ్ కర్రీ రామునాయుడు, ఎంపిడిఒ కె.కిషోర్ కుమార్, వైద్యాధికారి ఎం.సాయి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొత్స

జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలేవి?

ప్రజాశక్తి- శృంవరపుకోట

పట్టణంలోని సర్వే నంబర్ 147 జగనన్న కాలనీలో 70 శాతం ఇళ్ల పట్టాలు అనర్హులకే ఇచ్చారని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు వబ్బిన సత్తిబాబు, వబ్బిన సన్యాసినాయుడు ఆరోపించారు. జనసేన పార్టీ అధ్వర్యంలో 'జగనన్న కాలనీ కన్నీళ్లు' అనే కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని జగనన్న కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదన్నారు. అవకతవకలపై విచారణ చేపట్టి అర్హులకు కేటాయించాలన్నారు. కాలనీలో రోడ్లు, తాగు నీరుకి ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నిధులు కేటాయించి కాలనీ పేదలకు మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట మండల అధ్యక్షులు కోట్యాడ రామకోటి, చిన్ని, చంటి, ఎయిర్టెల్ సతీష్, కిరణ్, జామి జనసేన నాయకులు డేగల ఈశ్వరావు, వర్మ రాజు, ఎల్.కోట మండల నాయకులు సేక్ పిరోజ్, వేపాడ మండల నాయకులు రుద్ర నాయుడు పాల్గొన్నారు.


ఎస్‌కోట: జగనన్న కాలనీని పరిశీలిస్తున్న నాయకులు

భోగాపురం: నియోజకవర్గంలోని మత్స్యకార గ్రామమైన ముక్కాంలో జగనన్న కాలనీల పరిస్థితి అగమ్యగోచరంగ ఉందని జనసేన నెల్లిమర్ల నియోజకవర్గం నాయికులు లోకం మాధవి తెలిపారు. శనివారం జగనన్న కాలనీలో ఆమె పర్యటించారు. కాలనీలో ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారనీ, ఇప్పటికి ఆ ప్రాంతానికి వెళ్ళడానికి రోడ్లు అనువుగా లేవని, ప్రభుత్వం నుండి వచ్చే బిల్లులలో స్థానిక నాయకుల మొండి చెయ్యి చూపించారని చెప్పారు. కాలనీలో ఇళ్లు కట్టుకోకపోతే ప్రభుత్వ పథకాలు, రేషన్‌కార్డులు లేకుండా చేస్తామని వైసిపి నాయకులు బెదిరించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో భోగాపురం మండలం అధ్యక్షులు వందనాల రమణ, పల్లా రాంబాబు, జోగారావు పాల్గొన్నారు.

బొబ్బిలి: వైసిపి ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇళ్లు పేదలకు కన్నీళ్లను మిగులుస్తున్నాయని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. పట్టణ పేదల కోసం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేస్తామన్న సిఎం జగన్మోహన్ రెడ్డి పేదలను అప్పుల పాలుజేస్తున్నారని విమర్శించారు. పేదల కోసం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లలో మౌలిక సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు లేకపోవడంతో నిర్మాణ సామగ్రి తరలించేందుకు లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారన్నారు. కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఎస్.గంగాధర్, బి.దివ్య, రమ్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

'బూర్లె'కు డాక్టరేట్

ప్రజాశక్తి - గుర్ల

మండలం లోని గూడెం గ్రామానికి చెందిన బూర్లె వెంకటప్పల స్వామికి విశాఖ పట్నం ఆంధ్ర యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందజేసింది. బెస్ట్ రీసెర్చ్ అవార్డు పరిశోధకులు బివిఏ స్వామికి, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ లభించింది. శనివారం విజయనగరంలో ఆయనను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏయు వైస్-చాన్సలర్ ఆచార్య ప్రసాద రెడ్డి చేతుల మీదుగా అవార్డు కాపీనందుకున్నారు. ఈయన ఏయూ వీసీ ప్రొఫెసర్ పివిజిడి ప్రసాద్ రెడ్డి పర్యవేక్షణలో, సైంటిస్టు డాక్టర్ సురేష్ బాత సహకారంతో పరిశోధన పూర్తి చేశారు. డీప్ లెర్నింగ్ విధానాలను ఉపయోగించి డయాబెటిక్ రెటినోపతి పైన విస్తృతమైన పరిశోధన' అనే అంశంపై తన పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన డాక్టర్ స్వామి అతి సామాన్య కుటుంబం నుంచి వచ్చి అకుంఠిత దీక్షతో పేదరికంతో పోరాడి ఉన్నత విద్యనభ్యసించారు. పిహెచ్‌డి అవార్డు పొందిన సందర్భంగా డాక్టర్ బివిఏ స్వామిని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి, (డాక్టర్) లిఖిత, వైస్ ఎంపిపి తోట తిరుపతి రావు, తన స్వగ్రామ ప్రజలు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.


డాక్టరేట్‌ను అందిస్తున్న బొత్స

గడపగడపకుతో మేలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని అరిగి పాలెంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇన్ని పథకాలు ప్రవేశపెట్టిన జగన్మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఎంపిపి డి సత్యవంతుడు, ఎంపిటిసి పీవీ రమణ, వైసిపి మండల అధ్యక్షులు ఎం జగ్గు బాబు, యువజన సంఘం నాయకుడు శ్రీను, నాయకులు బుద్ధ అప్పల నాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, నెట్ క్యాబ్ డైరెక్టర్ సిహెచ్ పద్మ, దుల్ల సన్యాసిరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలం టీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రెండు పాన్ షాపులలో చోరీ

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక కోర్టు సెంటర్లో రెండు పాన్ షాపులలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. కోర్టు జంక్షన్‌లో గుప్తా, త్రినాధ పాన్ షాపుల తాళాలను, తలుపులను బలమైన ఇనుప రాడ్లతో నెట్టి షాపులలోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. అర్ధరాత్రి ఒంటి గంట వరకు పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. కోర్టు జంక్షన్ నుంచి పోలీసులు వెళ్లిపోయిన తర్వాత ఇద్దరు దుండగులు చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం షాపులు తెరిచేందుకు వచ్చేసరికి తాళాలు, తలుపులు పగలగొట్టి ఉండడంతో వ్యాపారులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలించగా పల్సర్ బైక్ పై ఇద్దరు యువకులు వచ్చి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

శ్రీకాకుళం జిల్లా దేవునిపాలవలస గెడ్డలో శుక్రవారం గల్లంతైన నెల్లిమర్ల మండలం పినతరిమి గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి లోకేష్ మృతదేహం శనివారం ఉదయం లభ్యమైంది. లోకేష్ స్నేహితులతో కలిసి సరదాగా ఈత కోసం చిట్ట గెడ్డకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీటి ఉధృతికి గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ లభ్యం కాలేదు. శనివారం ఉదయం లోకేష్ మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.